ఉద్యాన పంటలకు ఊతం

- పండ్ల తోటల సాగుకు ప్రత్యేక రాయితీ
- ఒక్కో మండలానికి ఐదెకరాల లక్ష్యం
- డీఆర్‌డీఏ ద్వారా ఎంపికకు కార్యాచరణ



చుంచుపల్లిలోని ఆయిల్‌పామ్ క్షేత్రంలో అంతర పంటగా సాగుచేసిన వేరుశనగ

చుంచుపల్లి: ఆరుగాలం శ్రమించే అన్నదాతకు భరోసా కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చేయూత నివ్వాలని సంకల్పించింది. ఇందుకోసం పండ్ల తోటల సాగుకు ఊతమిచ్చేలా తగు చర్యలకు ఉపక్రమించింది. తక్కువ పెట్టుబడి, తక్కువ నీటితో అత్యధికంగా ఆదాయం వచ్చే ఉద్యానవన పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని రైతులను ప్రోత్సహించేలా కేంద్ర ప్రభుత్వం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతోంది. రైతులకు ఉచితంగా పండ్ల మొక్కలు పంపిణీ చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీలకు వంద శాతం రాయితీపై, ఇతర వర్గాల వారికి బిందు, తుంపర సైద్యం చేసే పరికరాలు 90 శాతం రాయితీపై అందజేయాలని నిర్ణయించారు. దీనికోసం గ్రామీణ ఉపాధి హామీ నిధుల ద్వారా ఈ మొక్కలను పెంచి పెద్ద చేసి సంరక్షించేలా ప్రభుత్వం దృష్టి సారించనుంది. మండలంలో ఉపాధి హామీ పథకం 18 గ్రామ పంచాయతీల్లో అమలవుతోంది. ఇందులో భాగంగా ప్రతీ మండలానికి నిర్దేశించిన విధంగా ఇప్పటికే పండ్ల తోటలు పెంచుతున్నారు. రైతులు జామ, మామిడి, జీడి మామిడి, ఆయిల్‌ఫామ్, నిమ్మ, మునుగ, డ్రాగన్ తదితర పండ్ల తోటలు పెంచుతున్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధి ఆధ్వర్యంలో మార్చి 31 లోపు మండలానికి అయిదు ఎకరాల చొప్పున భూమి గుర్తించాలని నిర్ణయించారు. ఈ రైతులకు డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో మొక్కలు ఉచితంగా ఇవ్వడంతో పాటు మూడేళ్ల నిర్వాహణ నిమిత్తం కూడా ఇందుకు అవసరమయ్యే సామగ్రి, కూలీలకు ఉపాధి హామీ నిధుల నుంచి కేటాయించనున్నారు.

ఆసక్తి ఉన్న రైతులకు అవకాశం..

సంప్రదాయ పంటల సాగుకు స్వస్తి పలికి రైతులకు లాభదాయకమైన పంటల వైపు మళ్లించేందుకు గ్రామీణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ఉద్యానవన శాఖ ప్రత్యేకంగా ప్రణాళికలు రూపొందించింది. పండ్ల తోటల సాగు విస్తీర్ణం పెంచేందుకు రైతులకు రాయితీ వెసులుబాటును కల్పించింది. ప్రజాపాలన ప్రజా ఉత్సవాల్లో భాగంగా ఉపాధి పనుల జాతరలో మార్చి 2025 నాటికి పండ్ల తోటల పెంపకం పూర్తి చేయాలని ఆదేశాలున్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది మండలానికి ఐదు ఎకరాలు గుర్తించే పనుల్లో నిమగ్నమవ్వాలని సూచించారు. పండ్ల తోటల సాగుపై ఉద్యానవన అధికారులు ఆసక్తి కలిగిన రైతులను ప్రోత్సహిస్తూ అవగాహన కల్పిస్తూ రాయితీ అవకాశాలను వివరిస్తున్నారు. దీనికోసం రైతులు స్థానిక మండల పరిషత్ కార్యాలయాల్లో, ఉపాధి హామీ ఏపీఓలకు దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. దీనికి ప్రత్యేకంగా చివరి గడువు తేదీ అంటూ ఏమీలేదు. ఆసక్తి కలిగిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్, బ్యాంకు ఖాతా, ఉపాధి హామీ కార్డు, ఇతర ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలి.



మునగ తోటలో రైతు

ఉద్యాన పంటలతో ఆదాయం..



ఉద్యానవన పంటల సాగుకు రాయితీకి ధరఖాస్తు చేసుకోవాలి. దీని ద్వారా రైతులకు ఆదాయం సమకూరుతుంది. ఇప్పటికే రైతులకు డీఆర్‌డీఓ, ఉద్యానవన అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకొని రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– రఘుపతి, ఉపాధి హామీ ఏపీఓ, చుంచుపల్లి

అవగాహన కల్పిస్తున్నాం..



మండలంలో ఉద్యానవన పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాం. ఇప్పటికే పలుచోట్ల రైతులు ఆయిల్ ఫామ్ సాగును చేపట్టారు. కలెక్టర్ సూచనల మేరకు ఉద్యానవన పంటల ద్వారా వచ్చే లాభాలను రైతులకు వివరిస్తున్నాం. దీనిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

– రాజేశ్వరి, మండల వ్యవసాయ అధికారి

క్లుప్తంగా

ఘనంగా పడిపూజ



పడిపూజ నిర్వహిస్తున్న అర్చకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం పట్టణ పరిధి రైటర్ బస్తీలోని శ్రీధర్మశాస్త ఆలయంలో పడి పూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో 18 మెట్లను రంగురంగు పూలతో అలంకరించారు. వచ్చిన అయ్యప్ప మాలధారులతో ఆలయ ఆవరణమంతా అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. గురుస్వామి కృష్ణమూర్తి ఈ ఏడాదితో 50 సంవత్సరాల మాల ధారణ పూర్తయింది. కృష్ణమూర్తి గురుస్వామి ఆధ్వర్యంలో పడిపూజ మహోత్సవం ఎంతో ఘనంగా జరిగింది.

రేపు పెద్దమ్మతల్లి గుడిలో రుద్రహోమం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో మాస శివరాత్రి సందర్భంగా ఆదివారం రుద్ర హోమం పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎన్.రజనీకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. యాగశాలలో ఉదయం 9 గంటల నుంచి జరగనున్న హోమంలో పాల్గొనున్న భక్తులు రూ.1,516 చెల్లించి గోత్రనామాములను నమోదు చేసుకోవాలని కోరారు. వివరాలకు 6303408458 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



కేక్ కట్ చేస్తున్న పాస్టర్లు

సుజాతనగర్: సుజాతనగర్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక కల్వరీ సీయోను ప్రార్థనా మందిరంలో శుక్రవారం క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. పలువురు పాస్టర్లు మాట్లాడుతూ... ఏసుక్రీస్తు చూపిన మార్గం అనుసరణీయమని, ఆయన చూపిన శాంతిమార్గాన్ని మానవాళి అనుసరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాస్టర్లు ఎస్వీఆర్ పాల్, సీహెచ్ పాల్, మున్నా నాయక్, మార్కు రాజు, దయాకర్, డేవిడ్ రాజు, జి.పాల్, యోహాను, రాజశేఖర్, సీపీఐ నాయకులు కొమారి హనుమంతరావు పాల్గొన్నారు.

ఉద్యోగుల సెటిల్‌మెంట్లు సకాలంలో అందిస్తాం..



మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు

సింగరేణి(కొత్తగూడెం): ఏరియా జీఎం కార్యాలయంలో శుక్రవారం సీఎంపీఎఫ్ ట్రైపార్టీయేట్ కోఆర్డినేషన్ సమావేశం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు ఆధ్యర్యంలో సీఎంపీఎఫ్ అసిస్టెంట్ కమిషనర్ ఏ.కమలమ్మ అధ్యక్షతన జరిగింది. జీఎం మాట్లాడుతూ... సీఎంపీఎఫ్ కమిషనర్ సహకారంతో ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగస్తులకు సకాలంలో సెటిల్మెంట్‌లను అందజేటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షులు ఎండీ రజాక్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలకు అంతరాయం

ఇల్లెందు: ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంక్‌ను తెలంగాణ గ్రామీణ బ్యాంకుగా పేరు మారుస్తున్నందున మూడు రోజులు సేవలకు అంతరాయం కలుగుతుందని ఇల్లెందు బ్రాంచీల మేనేజర్లు కట్ల కోటయ్య, జే.సత్కీర్తి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మార్పు క్రమంలో 28 నుంచి 31వ తేదీ వరకు మూడు రోజులు బ్యాంకు సేవలు నిలిచిపోనున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు స్వీకరించాలి



మాట్లాడుతున్న కామేష్

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్ల పథకానికి దరఖాస్తులు స్వీకరించాలని బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యర్రా కామేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందేలా లేవని, ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు నిజమైన లబ్ధిదారులకు అందని ద్రాక్షలా ఉందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తామని ప్రకటించి సంవత్సరం గడిచాక ఇప్పుడు సర్వే అంటూ హడావుడి చేస్తున్నారు తప్ప నిజమైన లబ్ధిదారులకు పంపిణీ చేయాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదని విమర్శించారు. ప్రజాపాలనలో దరఖాస్తు కాలంలో చాలామంది ఇందిరమ్మ ఇళ్ల కోసం టిక్ మార్క్ చేసుకోకపోవడంతో ఇప్పుడు సర్వే సిబ్బంది ఇంటింటి సర్వేకు వచ్చినప్పుడు వారి పేర్లు లేకపోవడంతో లబ్ధిదారులు మున్సిపల్, రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి టిక్ చేయని వారి కోసం గడువు పెంచి మళ్లీ దరఖాస్తులు స్వీకరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గంధం మల్లికార్జునరావు, మాలోత్ వీరు నాయక్, పోలే కనకరాజు, వినయ్, మురళి పాల్గొన్నారు.

గడిచిపోయిన కాలం తిరిగి రాదు..



మాట్లాడుతున్న అబ్దుల్ బాసిత్

కొత్తగూడెంఅర్బన్: సమయాన్ని సద్వినియోగం చేసుకొని, జీవితాన్ని సార్థకం చేసుకోవాలని జమాతే ఇస్లామీ హింద్ రుద్రంపూర్, రామవరం శాఖ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ బాసిత్ అన్నారు. పవిత్ర శుక్రవారం సందర్భంగా రామవరం సుభాష్ చంద్రబోస్ నగర్‌లోని మస్జిద్‌లో జరిగిన ప్రార్థనల సందర్భంగా ఆయన మాట్లాడారు. సమయం చాలా విలువైంది, వీలైనంత వరకు దానిని మంచి పనులకి వినియోగించాలని, గడిచిపోయిన కాలం తిరిగి రాదన్నారు. విద్యార్థులు గంటల తరబడి వినియోగించి సమయాన్ని వృథా చేసుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో మస్జిద్ అధ్యక్షుడు బాబా, జావిద్, సులైమాన్, మస్తాన్, అబ్దుల్ మాజిద్ రబ్బానీ, మోయినుద్దీన్ పాల్గొన్నారు.

విలీనసభకు తరలిరండి..



మాట్లాడుతున్న ప్రసాద్

టేకులపల్లి: హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శనివారం జరగనున్న రెండు న్యూడెమోక్రసీ పార్టీల విలీనసభకు భారీగా తరలిరావాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు భూక్యా హర్జ్య, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండలంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రెండు పార్టీలుగా ఇప్పటి వరకు కొనసాగాయని విలీనంతో ఒకే పార్టీగా అవతరించబోతోందని తెలిపారు. ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రెండు న్యూడెమోక్రసీ పార్టీలు 2013లో నిర్మాణ సమస్యలతో విడిపోయాయని దీనితో ప్రజలకు, ప్రజా ఉద్యమాలకు తీవ్ర నష్టం జరిగిందని తిరిగి రెండు పార్టీలు ఒకే పార్టీగా అవతరించడం ప్రజా ఉద్యమాలకు ఉపయోగకరమని ప్రజా ఉద్యమం బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎట్టి నరసింహారావు, గుగులోతు రామచందర్, నర్సింగ్, మంచా తదితరులు పాల్గొన్నారు.

నేడు మోడల్ మార్కెట్ షాపుల కేటాయింపు

ఇలెందు: పట్టణ నడిబొడ్డున మోడల్ మార్కెట్‌లో షాపుల కేటాయింపునకు శ్రీకారం చుట్టినట్లు కమిషనర్ శ్రీకాంత్ శుక్రవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఉదయం 11 గంటలకు గదుల కేటాయింపు సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు హాజరై తమకు కావాల్సిన గదులను ఎంపిక చేసుకోవాలని కోరారు.

ఆర్‌ఎస్‌ఎస్ పదసంచలన్



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

ఇల్లెందు: ఆర్‌ఎస్‌ఎస్ శతజయంతి సందర్భంగా ఇల్లెందులో ఆర్‌ఎస్‌ఎస్ బాధ్యులు పదసంచలన్ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించి రాందేవ్ బాబా ఆలయం వద్ద సభ నిర్వహించారు. సతీష్ ఖండేల్‌వాల్, పాండురంగ మిట్టల్, డీకే శ్రీను, రాములోనియా, వెంకట్ నారాయణ, పూణ్యానాయక్, గోపీకృష్ణ, మామిడి జయప్రకాష్,పాల్గొన్నారు.

పరామర్శ

జూలూరుపాడు: బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి లకావత్ గిరిబాబు తల్లి లకావత్ లక్ష్మి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు గిరిబాబుకు శుక్రవారం ఫోన్ చేసి లక్ష్మి మృతి పట్ల సంతాపం తెలిపారు. కుటుంబసభ్యులకు హరీష్‌రావు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం



వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు, జీపీ కార్మికులు

జూలూరుపాడు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి జీపీ కార్మికులు వినతిపత్రం అందజేశారు. 27, 28వ తేదీల్లో జరగనున్న సమ్మెలో భాగంగా శుక్రవారం జీపీ కార్మికులు జూలూరుపాడులోని చంద్రగొండ క్రాస్ రోడ్ వద్ద ఉన్న డాక్టర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ... రాష్ట్రంలో 12,790 గ్రామ పంచాయతీల్లో సుమారు 60,000 మంది గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు పని చేస్తున్నారన్నారు. పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధిలైట్లు, డంపింగ్ యార్డు, హరితహారం, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ట్రాక్టర్ డ్రైవర్లు, గ్రామ పంచాయతీ కార్యాలయ నిర్వాహణ తదితర వంటి వివిధ కేటగిరిల్లో పనులు చేస్తున్నట్లు చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో అంటువ్యాధులు, అనారోగ్యం బారినపడకుండా ప్రజలకు సేవలందిస్తున్న జీపీ కార్మికులు చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం జీపీ కార్మికుల వేతనాలు రూ.8,500లకు పెంచి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని ప్రవేశపెట్టిందని ఆరోపించారు. ఈ విధానంతో అన్ని పనులు చేయిస్తున్నారని విమర్శించారు. మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, కేటగిరీల వారీగా జీపీ కార్మికుల వేతనాలు పెంచాలని జేఏసీ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జేఏసీ నాయకులు వై.గోపాల్‌రావు, యాసా నరేష్, ఎస్కే చాంద్‌పాషా, రాయల సిద్ధు, ఈర్యా, లాలయ్య, సంజీవరావు, వినోద్, హనుమంతరావు, బాపట్ల పూర్ణచందర్‌రావు, గార్లపాటి శివకృష్ణ, నిమ్మటూరి లచ్చయ్య, నరసింహారావు, శివ పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేద్దాం..



మాట్లాడుతున్న డాక్టర్ లోహిత

ఇల్లెందురూరల్: క్షయ వ్యాధి నిర్మూలనకు ప్రతీఒక్కరు వైద్యశాఖకు సహకరించాలని కొమరారం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ లోహిత అన్నారు. మండలంలోని పోలారం గ్రామంలో క్షయ వ్యాధిపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. క్షయ వ్యాధి అంటు వ్యాధి అని, దీర్ఘ కాలిక రోగాలలో ప్రధానమైందని చెప్పారు. ఇది ఊపిరితిత్తులకు సంబంధించినది అయినా చర్మము నుంచి మెదడు వరకు శరీరంలో ఏ భాగానికైనా వచ్చే అవకాశం ఉందన్నారు. మైకో బాక్టీరియా లేదా మైకో బ్యాక్టీరియా ట్యూబర్ క్యూలోసిస్ అనే సూక్ష్మక్రిమి వల్ల ఈ వ్యాధి వస్తుందని పేర్కొన్నారు. ఇది ప్రధానంగా శ్వాసకోశాన్ని దెబ్బతీస్తుందని చెప్పారు. క్షయ జబ్బు ఉన్నవారు దగ్గినా, తుమ్మినా లేదా ఉమ్మినా గాలి ద్వారా వేరే వారికి వ్యాప్తి చెందుతుందన్నారు. వ్యాధి సోకినట్లు అనుమానం కలిగిన వారు వెంటనే సమీపంలోని పీహెచ్‌సీలో పరీక్షలు చేయించుకొని క్రమం తప్పకుండా మందులు వాడితే ఫలితం ఉంటుందన్నారు.

కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలి



డ్రెయినేజీలను పరిశీలిస్తున్న అనంతరాములు

పాల్వంచ: మున్సిపాలిటీలో చేస్తున్న అభివృద్ధి పనులు నాణ్యత లేకుండా చేస్తుండటంతో రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగం అవుతున్నాయని టీడీపీ రాష్ట్ర నాయకుడు కనగాల అనంతరాములు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని పలు ఏరియాల్లో దెబ్బతిన్న రోడ్లు, డ్రెయినేజీలు, అభివృద్ధి పనులు, దమ్మపేట రహదారుల్లో ప్యాచ్ వర్కులు చేసిన ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అనంతరాములు మాట్లాడుతూ... గత కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్, డీఈ, ఏఈలుగా పనిచేసిన అధికారుల హయాంలో చేసిన పనులన్నీ నాణ్యత లేకుండా చేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో దెబ్బతిన్నాయని ఆరోపించారు. పనులు చేసిన కాంట్రాక్టర్లను బ్లాక్‌లిస్ట్‌లో పెట్టి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నంబూరి వెంకటేశ్వరరావు, బి.వాసు, వెంకన్న, సుబ్బారావు, సురేష్, అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలు ప్రారంభం



గంధం, చాదర్‌తో ఊరేగింపు దృశ్యం

- భారీగా తరలి వచ్చిన భక్తులు
- అలరించిన ఖవ్వాలి కళా ప్రదర్శన

టేకులపల్లి: బేతంపూడిలోని హజరత్ సయ్యద్ జమాలుద్దీన్ బిహారీ బాబా దర్గా ఉర్సు వేడుకలు శుక్రవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యుత్ దీపాల వెలుగులో దర్గా పరిసరాలు దేదీప్యమానంగా వెలుగొంతున్నాయి. ఆనవాయితీ ప్రకారం రాత్రి 8 గంటలకు కొత్తగూడెంలోని సూపర్‌బజార్‌కు చెందిన సి.మాలిక్‌ల నివాసం నుంచి పవిత్రమైన గంధాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చారు. టేకులపల్లి మండలం బొమ్మనపల్లి నుంచి భక్తి పారవశ్యంతో గంధాన్ని, చాదర్‌ని తీసుకుని మేళతాళాలతో నృత్యాలు చేస్తూ ఊరేగింపుగా బేతంపూడి దర్గాకు చేర్చారు. మార్గమధ్యలో అడుగడుగునా భక్తులు గంధం, చాదర్ తీసుకొస్తున్న వారి పాదాలకు నీళ్లు పోసి స్వాగతం పలికారు. టేకులపల్లితో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా, తెలంగాణ రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్ నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

శుక్ర, శని, ఆదివారాలు మూడు రోజులు దర్గాలోనే ఉంటారు. ఇక్కడ బస చేస్తే మంచి జరుగుతుందనే నమ్మకంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు మూడు రోజుల పాటు దర్గా వద్దనే గడపడం ఆనవాయితీగా వస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ కళాకారుడు సయిద్ ఖాన్ అర్షి చేత నిర్వహించిన ఖవ్వాలి కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. వేడుకలకు వచ్చిన భక్తులు, అక్కడ ఏర్పాటు చేసిన వివిధ సామగ్రి దుకాణాలతో సందడి వాతావరణం నెలకొంది. ఉర్సు వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ పోగుల సురేష్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియ, లక్కినేని సురేందర్‌తో పాటు నిర్వాహకులు గ్రామపెద్దలు హాజరయ్యారు.

గ్రామపంచాయతీ కార్మికుల టోకెన్ సమ్మె



ఇల్లెందురూరల్: నిరసన తెలుపుతున్న కార్మిక సంఘాల నాయకులు



పాల్వంచరూరల్: ఎంపీడీఓ కార్యాలయం ఎదుట..



టేకులపల్లిలో సమ్మెలో పాల్గొన్న కార్మికులు

ఇల్లెందురూరల్: మండలంలోని అన్ని గ్రామపంచాయతీల కార్మికులు శుక్రవారం విధులను బహిష్కరించి టోకెన్ సమ్మె చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దు చేసి మెరుగైన వేతనాలు ఇవ్వాలని కోరారు. ప్రభుత్వం తక్షణం స్పందించకుంటే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు జటంగి వెంకన్న, దేవరకొండ శంకర్, నబీ, మల్లెల వెంకటేశ్వర్లు, బందం నాగయ్య, తాళ్లూరి కృష్ణ, రామిశెట్టి నర్సింహారావు, నజీర్ అహ్మద్, లక్ష్మణ్, మోహన్‌రావు, కిరణ్, కిషోర్, తిరుపతి, సుమలత పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ, టీయూసీఐ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీఓ నారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా కార్మిక సంఘం నాయకులు మాట్లాడారు. గ్రామాలను నిత్యం శుభ్రంగా ఉంచేందుకు విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. కార్మికులకు నెలకు రూ.26వేలు వేతనాలు ఇవ్వాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, ఈఎస్ఐ బీమా సౌకర్యం అమలు చేయాలని, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని, కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దొడ్డ రవికుమార్, సత్య, నిమ్మల రాంబాబు, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, సోమలింగం, నీలం భాస్కర్, పూనెం రమేష్, వేల్పుల రమేష్ పాల్గొన్నారు.

టేకులపల్లి: కార్మిక సంఘాల జేఏసీ పిలుపులో భాగంగా శుక్రవారం టేకులపల్లి మండలంలో గ్రామపంచాయతీ కార్మికుల రెండు రోజుల టోకెన్ సమ్మె ప్రారంభమైంది. ఈ మేరకు శుక్రవారం టేకులపల్లి పంచాయతీ కార్యాలయంలో మండలంలోని కార్మికులు సమ్మె చేశారు. ఈ సందర్భంగా యూనియన్ టేకులపల్లి మండల అధ్యక్ష, కార్యదర్శులు మూడు బిచ్చు, ఈసం మహేష్ మాట్లాడుతూ.. రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా శుక్ర, శనివారాలు నిర్వహించే టోకెన్ సమ్మెలో గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాబోయే కాలంలో నిరవధిక సమ్మెకు రాష్ట్ర జేఏసీ నిర్ణయం చేయబోతోందన్నారు. తొలిరోజు టోకెన్ సమ్మెకు ఇఫ్టూ రాష్ట్ర నాయకులు డి.ప్రసాద్ సంఘీభావం తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అన్నాజీ, నాను, జినకా ప్రసాద్, నాగేశ్వరరావు, బాబు, ప్రశాంత్, నాగేందర్, చారి, లక్ష్మయ్య, అశోక్ పాల్గొన్నారు.

మన్మోహన్‌సింగ్ సేవలు భావితరాలకు స్ఫూర్తి

మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ మృతికి కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంతాపం తెలిపారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ.. మన్మోహన్ సింగ్ మృతితో దేశం గొప్ప ఆర్థిక వేత్తను కోల్పోయిందని, ఆయన మృతి ఎంతో బాధాకరమన్నారు. పదేళ్ల పాటు దేశాన్ని ఆర్థిక సంస్కరణలతో ప్రగతి పథంలో నడిపిన గొప్ప దార్శనికుడు మన్మోహన్‌సింగ్ అని పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలోనూ ఆయన నిర్ణయాలు దేశ ఆర్థిక వ్యవస్థను నిలబెట్టాయని, భావితరాలను స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్



కొత్తగూడెంరూరల్: నివాళులర్పిస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, నాయకులు



పాల్వంచ: నివాళులర్పిస్తున్న కొత్వాల



జూలూరుపాడులో నివాళులర్పిస్తున్న నాయకులు



ఇల్లెందు: నివాళులర్పిస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, నాయకులు